# జనం వెలుగు

TELTEL/2023/87917

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం



విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 02 | సంచిక : 314 | సోమవారం 03 - 02 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజీలు : 8 | వెల : 6 /-


# నిజామాబాద్‌కు స్మార్ట్ సిటి ఇవ్వాల్సిందే!

- ఉత్తర తెలంగాణకు తీవ్ర అన్యాయం
- కేంద్ర బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన డాక్టర్ బి. కేశవులు
- జాతీయ GDPలో 5.1% వాటా ఉన్నా, రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు లేవన్న విమర్శ
- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం హామీలు అమలు చేయడంలో కేంద్రం విఫలం
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ.45,000 కోట్లు మాత్రమే కేటాయింపు
- ప్రత్యేక నిధుల కోసం తెలంగాణ ఎంపీల ఢిల్లీ పర్యటనలన్నీ వృథా-కేంద్రంపై తీవ్ర విమర్శలు
- నార్త్ తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ డాక్టర్ కేశవులు

**ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీ హెూదా కల్పించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ బి. కేశవులు కేంద్రాన్ని నిలదీశారు.**

**జనంవెలుగు, హైదరాబాద్:** తాజాగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నార్త్ తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బి. కేశవులు కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అదనపు నిధులు దక్కుతాయని ఆశించినా, కేంద్రం నిరాశే మిగిల్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "జాతీయ స్థూల జాతీయోత్పత్తిలో (GDP) తెలంగాణ వాటా 5.1 శాతంగా ఉన్నా, తాజా బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వలేదని" ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, గిరిజన యూనివర్సిటీకి కూడా నిధులు కేటాయించలేదని అన్నారు. ఉత్తర తెలంగాణకు మరింత అన్యాయం జరిగిందని, నిజామాబాద్ లేదా అదిలాబాద్‌కు కనీసం స్మార్ట్ సిటీగా గుర్తింపు కూడా ఇవ్వలేదని డాక్టర్ కేశవులు ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు ఎంపీలను భారీ మెజార్టీతో గెలిపించినప్పటికీ, ఉత్తర తెలంగాణపై కేంద్రం ఏమాత్రం దృష్టి పెట్టలేదని ఆరోపించారు.

### తెలంగాణకు కేవలం హక్కుగా వచ్చే నిధులే - ప్రత్యేక కేటాయింపులేమీ లేవు

కేంద్ర బడ్జెట్ ప్రకారం తెలంగాణకు వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26లో పన్నుల్లో వాటా, కేంద్ర పథకాలు, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ల ద్వారా రూ. 45,000 కోట్లు మాత్రమే రానున్నాయి. అలాగే, కేంద్రానికి వివిధ పన్నుల ద్వారా సమకూరే ఆదాయంలో తెలంగాణకు కేవలం 2.102% వాటా - అంటే రూ. 29,890 కోట్లు మాత్రమే వస్తాయని డాక్టర్ కేశవులు వివరించారు.



డాక్టర్ బి. కేశవులు

### తెలంగాణ ఎంపీల ఢిల్లీ పర్యటనలు వ్యర్థం

తెలంగాణ ఎంపీలు పదే పదే ఢిల్లీకి వెళ్లినా, రాష్ట్రానికి ఏదైనా ప్రత్యేక నిధులు తెచ్చుకోలేకపోయారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. "తెలంగాణకు కేంద్రం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకపోవడం దురదృష్టకరం. న్యాయంగా రావాల్సిన వాటాలు మాత్రమే ఇచ్చి, అదనపు ప్రోత్సాహకాలు ఏవీ ఇవ్వకపోవడం ఆక్షేపనీయము" అని అన్నారు.

## గంజాయి స్వాధీనం, ఇద్దరు అనుమానితుల అరెస్టు

**జనంవెలుగు, నందిపేట్:-** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై గణనీయమైన చర్యలో, సబ్-ఇన్‌స్పెక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో వెల్మల్ కూడలి వద్ద వాహన తనిఖీలో స్థానిక పోలీసులు 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో అక్రమ పదార్థాల రవాణాను అరికట్టేందుకు కొనసాగుతున్న ప్రయత్నాల్లో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు అనుమానంగా కనిపించిన స్కూటీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో గంజాయిని కనుగొన్నారు. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన షేక్ అప్ రోజ్ (26), షేక్ మహబూబ్ (23) అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. నిందితులు నందిపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు గంజాయి రవాణా చేస్తున్నట్టు విచారణలో తేలిందని, దీంతో ఆ ప్రాంతంలో డ్రగ్స్ సంబంధిత కార్యకలాపాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి సమాజ భద్రతను నిర్ధారించడానికి చట్టాన్ని అమలు చేసే నిబద్ధతను ప్రదర్శిస్తూ, స్థానిక పోలీసు కానిస్టేబుళ్ల సహకారంతో ఈ ఆపరేషన్ అమలు చేయబడింది. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలను నివేదించాలని ప్రజలను కోరుతున్నారు.




## బాలనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా వాటర్ బాటిళ్ల పంపిణీ

జక్రాన్ పల్లి మండలంలోని బాలనగర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. బోర్గాం గ్రామానికి చెందిన సందగిరి రాజశేఖర్ రెడ్డి, తన తండ్రి సందగిరి మల్లారెడ్డి జ్ఞాపకార్థంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుసమాంజస, మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలకు సహాయం చేయడం గొప్ప కార్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీత, సుజాత, రేవతి, శ్రీనివాస్, విట్టల్ రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

